

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బొమ్మాళి రామారావును సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఒ ఉమాసుందరి, ఎపిఒ వాసుదేవనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో ఒక పార్టీ రాజకీయ సభలో ఆయన పాల్గొన్నట్లు పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. ఆ నివేదిక ఆధారంగా ఆయన్ను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కూడా పలుమార్లు ఫీల్డ్ అసిస్టెంట్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ వేటు పడింది.

సాగుకు సమాయత్తం

- ఈ ఖరీఫ్‌లో 4,21,655 ఎకరాల్లో వరి సాగు
- 38,882 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ
- జూన్ మొదటి వారంలో అందజేతకు ఏర్పాట్లు
- పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభం

నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేస్తుండడంతో, అందుకనుగుణంగా రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. చాలాచోట్ల వేసవి దుక్కులు ఇప్పటికే పూర్తయ్యాయి. జూన్ ఒకటో తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. పంటల సాగు, విత్తనాల పంపిణీపై వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రయివేట్ వ్యాపారులూ విత్తనాల విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఏటా 33 శాతం రాయితీపై వరి విత్తనాలు సమకూర్చుతోంది. గతేడాది మాదిరిగానే ఉత్తరాంధ్రకు జిల్లాలకు వరి రకం విత్తనాలపై 46 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,21,655 ఎకరాల్లో వేసేలా అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. అందులో 3,87,322.5 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేశారు. సజ్జలు 127.5 ఎకరాల్లో సాగు ఉండొచ్చని అధికారులు అంచనాలు రూపొందించారు. మొక్కజొన్న 25,270 ఎకరాలు, రాగులు 92.5 ఎకరాలు వేయనున్నారు. పప్పు ధాన్యాలకు సంబంధించి కంది 230 ఎకరాల్లో, పెసర 137.5, మినప పంట 172.5 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు. వేరుశనగ 730 ఎకరాల్లో, నువ్వులు 57.5 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేస్తున్నారు. పత్తి 3,887.5 ఎకరాల్లో, గోగు పంట 142.5 ఎకరాల్లో సాగు చేయనున్నారు. చెరకు 3,485 ఎకరాల మేర సాగయ్యేలా ప్రణాళికలు రూపొందించారు.

అధికారులు పంపిన వరి విత్తన రకాల ప్రతిపాదనలు

వరి విత్తన రకం	ప్రతిపాదనలు (క్వింటాళ్లలో)
ఎంటియు 1061 (ఇంద్ర)	9,903
ఎంటియు 1064 (అమర్)	3,272.6
ఎంటియు 1121 (శ్రీధృతి)	7,683.5
ఎంటియు 7029 (స్వర్ణ)	3,993
ఎంటియు 1318	1015
ఆర్‌జిఎల్ 2537	2,661
శ్రీకాకుళం సన్నాలు (బిపిటి 3291)	760
సోనామసూరి (బిపిటి 5204)	4,744.5
సాంబమసూరి (ఎంటియు 1224)	2387.4



అంపోలులోని విత్తన ప్రాసెస్, నిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడి శ్రీధర్

38,882 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు

ప్రస్తుత ఖరీఫ్‌కు అన్నిరకాల విత్తనాలు కలిపి 38,882 క్వింటాళ్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందులో సాధారణ రైతుల అవసరాల కోసం 36,662 క్వింటాళ్లు, ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 90 శాతం సబ్సిడీపై అందించేందుకు 2,220 క్వింటాళ్లను కేటాయించారు. వరి రకానికి సంబంధించి 36,420 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందులో సాధారణ రాయితీ అందించేందుకు 34,200 క్వింటాళ్లు, 90 శాతం రాయితీపై అందించేందుకు 2,220 క్వింటాళ్లు అవసరమని గుర్తించారు.

జిల్లాలో ఈ ఏడాది ఎంటియు 1061 రకం సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ రకం విత్తనాలను సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ 9,903 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపింది. స్వర్ణ రకం విత్తనాలు 7,433 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపారు.

50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడడంతో భూసారం క్రమేణా దెబ్బతింటోంది. భూమిలో సేంద్రియ పదార్థం దెబ్బతిని, నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఖరీఫ్‌లో 1540 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఇందులో కట్టెజనుము 516 క్వింటాళ్లు, జీలుగ 1020 క్వింటాళ్లతో పాటు పిల్లిపెసర నాలుగు క్వింటాళ్లను 50 శాతం రాయితీపై అందించనున్నారు. పది కేజీల ప్యాకెట్ రూ.880 కాగా, రూ.440కే అందిస్తున్నారు.

జూన్ మొదటి వారంలో విత్తనాల పంపిణీ

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. పచ్చిరొట్ట వితనాల పంపిణీని ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభించాం. రైతుభరోసా కేంద్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలకు అనుగుణంగా వరి, ఇతర రకాల విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. విత్తనాల కోసం ఈనెల 22వ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తాం. ఇప్పటికే 16 వేల క్వింటాళ్ల విత్తనాలను పలు వ్యవసాయ సబ్ డివిజన్లకు తరలించాం. జూన్ మొదటి వారంలో వరి విత్తనాలు పంపిణీ చేస్తాం.

- కె.శ్రీధర్,
వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు



నౌపడలో మోహరించిన పోలీసు బలగాలు

పోలీసు వలయంలో పోర్టు ప్రాంతాలు

- అదనపు బలగాలు మోహరింపు
- 144 సెక్షన్ అమలు
- 60 మంది టిడిపి నాయకుల గృహ నిర్బంధం

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు ప్రాంతాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూలపేట పోర్టుకు రాళ్లు తరలించే వాహనాలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అనుచరులు అడ్డుకుంటారన్న ముందస్తు సమాచారంతో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎస్‌పి జి.ఆర్ రాధిక చర్యలు చేపట్టారు. వచ్చే నెల ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నౌపడ, పాలవానిపేట, రావివలస, మూలపేట, ఎం.సున్నాపల్లి, కె.లింగూడు, టెక్కలి పట్టణం తదితర ప్రాంతాల్లో 650 మంది బలగాలను మోహరించి, 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ప్రవేశ మార్గాల్లో ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి, కొత్త వ్యక్తులపై ప్రత్యేక దృష్టిసారించారు. నౌపడలో శుక్రవారం రాత్రి నుంచే అదనపు బలగాలను రప్పించి, ప్రధాన కూడలిలో పోలీసు సిబ్బంది పహారా కాశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరూ గుంపులుగా రోడ్లపై తిరగవద్దని ప్రజలకు సూచించారు.

టిడిపి నాయకుల గృహ నిర్బంధం

సంతబొమ్మాళి మండలం నౌపడ, సీతానగరం, మర్రిపాడు, మూలపేట, యామాలపేట, హనుమంతునాయుడుపేట, ఆకాశలఖవరం, కె.లింగూడు, సున్నాపల్లి తదితర ప్రాంతాలకు చెందిన టిడిపి నాయకులకు పోలీసులు నోటీసులు అందించారు. శాంతిభద్రతల దృష్ట్యా వారిని గృహ నిర్బంధం చేశారు. నౌపడలో టిడిపి మండల అధ్యక్షుడు జీరు భీమారావు, మాజీ ఎంపిపి కర్రి విష్ణుమూర్తి, నాయకులు కూచెట్టి కాంతరావు, మెండ అప్పారావు, అరుణ్ కుమార్, వసంతకుమార్, భాస్కరరావుతో పాటు 60 మందికి సిఆర్‌పిఎస్ 149 సెక్షన్ ప్రకారం నోటీసులు అందించి గృహ నిర్బంధం చేశారు.



డిప్యూటీ సిఇఒతో సమస్యలపై చర్చిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పారిశుధ్య కార్మికుడు హత్య

- గొంతు కోసి హతమార్చిన దుండగులు
- ఇంటి మేడపై నిద్రిస్తుండగా దారుణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



సురేష్ (ఫైల్)



రక్తపుమడుగులో సురేష్ మృతదేహం

నగరంలోని గూనపాలెంకు చెందిన పారిశుధ్య కార్మికుడు శీర సురేష్ (34) గురువారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. ఇంటి మేడపై నిద్రిస్తున్న సమయంలో కత్తితో గొంతు కోయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డిఎస్‌పి కార్యాలయానికి కూతవేటు దూరంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. పోలీసుల కథనం ప్రకారం శ్రీకాకుళం నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్న సురేష్ గూనపాలెంలోని రామమందిరం సమీపంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. గురువారం రాత్రి కుటుంబసభ్యులతో సరదాగా గడిపిన సురేష్, తాను నివాసం ఉంటున్న ఇంటి దగ్గర్లో ఉన్న మేడపై భార్య, పిల్లలతో కలిసి నిద్రించాడు. మధ్య రాత్రిలో ఆయన భార్య తిరుమలకు మెలకువ వచ్చి లేచి చూసేసరికి సురేష్ మేడ పైనే కొంచెం దూరంలో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఆయన గొంతు కోసి చలనం లేకుండా పడి ఉండడంతో ఆందోళన చెందిన ఆమె, కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. వారు వచ్చి చూసి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న సిఐ సన్యాసినాయుడు, ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్ మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని దుండగులు సురేష్ గొంతు కోసం హతమార్చినట్లు నిర్ధారించి, దర్యాప్తు ప్రారంభించారు.

పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్న సురేష్‌కు స్థానికంగా ఎవరితోనూ విభేదాల్లేవని ఆయన కుటుంబసభ్యులు చెప్తున్నారు. సురేష్‌కు 14 ఏళ్ల కిందట తిరుమలతో వివాహమైంది. వారిద్దరిదీ కులాంతర ప్రేమ వివాహం. వారికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. రాత్రి 11 గంటల సమయంలో ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడిన తర్వాత తాము మేడ పైకి వెళ్లి నిద్రించామని తిరుమల పోలీసులకు తెలిపింది. మధ్యలో తాను లేచిన సమయంలో నిద్రలోనే ఉన్నారని చెప్పింది. అర్ధరాత్రి 1.30 గంటల దాటిన తర్వాత మెలకువ వచ్చి చూసేసరికి తమకు కాస్త దూరంలో రక్తపుమడుగులో పడి ఉన్నాడని తెలిపింది. సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ గణేష్ భార్య, ఇతర కుటుంబసభ్యులతో మాట్లాడి పలు కోణాల్లో ఆరా తీశారు. సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. సురేష్ తండ్రి రమణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సిసి ఫుటేజ్ ఆధారంగా ముగ్గురు వ్యక్తులు ఆ ప్రాంతంలో సంచరించినట్లు అనుమానిస్తున్నారు. మృతుని కాల్‌డేటాను పోలీసులు సేకరించడంతో పాటు స్థానికులతో మాట్లాడి సురేష్ హత్య వెనుక బలమైన కారణాలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు. సురేష్‌కు స్థానికంగా ఎవరితోనూ వైరం లేదని కుటుంబసభ్యులు చెప్పడంతో, ఆయనకు వివాహేతర సంబంధాల కోణంలోనూ దర్యాప్తు చేపడుతున్నారు.

వ్యాయామం అవసరం

- ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలి
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత జీవనశైలిలో శారీరక వ్యాయామం తప్పనిసరి అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ ఆవరణ నుంచి నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారిలో 25శాతం రక్తపోటుకు గురవుతున్నారని తెలిపారు. వ్యాయామం తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపారు. ప్రతిఒక్కరూ వారంలో ఐదు రోజులు 30 నుంచి 40 నిమిషాలు చొప్పున వ్యాయామం చేయాలని సూచించారు. ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలన్నారు. ఉప్పు, స్వీట్స్, నూనెల వాడకం తగ్గించి ముందస్తు జాగ్రత్తలు పాటించడం చాలా అవసరమన్నారు. తరచుగా బిపి చెక్ చేయించుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. వీటితోపాటు వైద్యాధికారుల సూచనల మేరకు ప్రతిఒక్కరూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలన్నారు. శారీరక వ్యాయామం, బిపి నియంత్రణలో ఉంచుకునేందుకు కృషి చేస్తామని ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆశావర్కర్స్ నుంచి ప్రతిఒక్కరూ సమాజంలో ఉన్న తోటి వారిలో, బిపి స్క్రీనింగ్ ప్రాధాన్యతను వివరించి, ఆరోగ్యకర జీవన ప్రమాణాలపై అవగాహన కల్పించాలన్నారు. తద్వారా గుండె సంబంధిత వ్యాధుల నియంత్రణలో అందరూ భాగస్వాములవుతారని చెప్పారు. కార్యక్రమంలో డిఐఒ ఈశ్వరిదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, సుజాత, శ్రీదేవి, ఎన్‌సిడి పైడి అప్పారావు, డిపిఎంఒ జి.వి వెంకటలక్ష్మి, వాన సురేష్, డిపిఒ జి.సన్యాసినాయుడు, మురళి, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పిఎఫ్ స్లిప్పులు ఉంచాలి

జెడ్‌పి డిప్యూటీ సిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్ యాజమాన్యం పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ స్లిప్పులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి కోరారు. నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్రామన్‌ను ఆయన ఛాంబరులో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2019-20, 2020-21, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్య నిధి ఖాతాల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బూస్టర్ స్కీమ్ క్లయిమ్‌లను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ విరమణ క్లయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఇటీవల ఎయిడెడ్ యాజమాన్యం నుంచి మండల పరిషత్, జిల్లా యాజమాన్యంలోకి మారిన ఉపాధ్యాయుల భవిష్యనిధి ఖాతా నంబర్ల మంజూరుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సిఇఒ హామీనిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రవికుమార్, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు, ఎల్.కోదండరామయ్య, రెడ్డి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద తనిఖీ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పహారాను తనిఖీ చేయాలన్నారు. స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను శుక్రవారం పరిశీలించి, రిజిస్టర్‌లో సంతకం చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల కేంద్ర పోలీస్ బలగాల గార్డును, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ గార్డును, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌కి నలువైపులా పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు, సిసి కెమెరాల పర్యవేక్షణపై ఆరా తీశారు. పలు అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్

ప్రజాశక్తి - రణస్థలం



మాట్లాడుతున్న డిఈఒ వెంకటేశ్వరరావు

ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కొండములగాం మోడల్ స్కూల్‌లో సిబిఎస్ఇ సిలబస్ అమలు చేసే పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సిబిఎస్ఇ సిలబస్ వరమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సిబిఎస్ఇ సిలబస్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరింత రాణిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. విద్యా ప్రమాణాల విషయంలోనూ మెరుగుదల ఉందని, అందుకు పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన మార్కులే నిదర్శమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రితో పాటు పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వరకు అన్నీ ఉచితంగా లభిస్తాయన్నారు. సిబిఎస్ఇ సిలబస్ అమలు చేసే పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణా తరగతులలో డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి, రాష్ట్ర పరిశీలకులు ఎస్.వి.డి రమణ, రాష్ట్ర మోనటరీ అధికారి ప్రసాద్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు శ్రీరాములు

- ప్రజా ఉద్యమాల నిర్మాణమే ఆయనకు ఘన నివాళి
- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

కార్మిక, కర్షక, గిరిజన, ప్రజా సమస్యలపై పోరాడిన శ్రీరాములు ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా ఉంటారని పలువురు వక్తలు పేర్కొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు సంస్మరణ సభను నగరంపల్లిలో శుక్రవారం నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిపిఎం నాయకులు వి.జి.కె మూర్తి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయడం ప్రారంభించిన ఆయన తుది శ్వాస విడిచే వరకు పోరుబాటను వీడలేదని కొనియాడారు. దోపిడీ పీడనకు వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం పెద్దఎత్తున ఉద్యమాలు నిర్మించారని గుర్తుచేశారు. ప్రభుత్వ దమనకాండ, నిర్బంధకాండను సైతం లెక్కచేయక ప్రజా పోరాటాలు నడిపారని తెలిపారు. 1968 నుంచి 1975 వరకు అజ్ఞాతంలో ఉన్నారని, పార్వతీపురం కుట్ర కేసులో 1975లో అరెస్టయి రెండేళ్ల పాటు జైల్లో నిర్బంధించబడ్డారని తెలిపారు. ఉప్పు కార్మికులకు సంబంధించి కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ... ట్రాక్టర్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ అమలు చేయాలని కార్మిక హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని చెప్పారు. శివారు భూములకు వంశధార నీరు అందించడంలో అందరినీ ఐక్యం చేసి పోరాడారని గుర్తుచేశారు. ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర కోసం పలు పోరాటాలు నడిపారని తెలిపారు. 90 ఏళ్ల వయసులోనూ జీడి కార్మికుల సమస్యలపై ఆందోళనలు చేపట్టిన ప్రజా పోరాట నాయకుడు అని అన్నారు. కమ్యూనిస్టు విలువలు, ప్రమాణాల కోసం శ్రీరాములు నికరంగా నిలబడ్డారన్నారు. 90 ఏళ్ల వయసులోనూ పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్నారని కొనియాడారు. ప్రజా ఉద్యమాల నిర్మాణమే బమ్మిడి శ్రీరాములుకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. నగరంపల్లి కేంద్రంగా పలాస ప్రాంతంలో ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి, ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలోపేతం చేశారని గుర్తుచేశారు. శ్రీరాములు తన జీవితాన్నే కాదని కుటుంబాన్నీ పార్టీకి అంకితం చేశారని కొనియాడారు. ఆయన చూపిన బాటలో నేటితరం పయనించాలన్నారు. శ్రీరాములు జీవిత విశేషాలపై ఎస్.మనోజ్, ఎన్.చంద్రయ్య, టి.వైకుంఠరావు రాసి ఆలపించిన గీతాలు సభికులను ఉత్తేజపరిచాయి. సిపిఎం మండల కమిటీ కన్వీనర్ నెయ్యిల మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, మన్యం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, రైతుసంఘం నాయకులు కె.మోహనరావు, శ్రీరాములు కుటుంబసభ్యులు బమ్మిడి ఆనందరావు, అరుణ్ కుమార్, రామకృష్ణ, వైద్యులు తెప్పల ఆనందరావు, ఎఐసిసిటియు నాయకులు వాసుదేవరావు, న్యూడెమోక్రసీ నాయకులు కుసుమ, సర్పంచ్ దువ్వాడ మధుకేశ్వరరావు, ఎంపిటిసి మోహనరావు, మాజీ సర్పంచ్ జైరాం చౌదరి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

కలెక్టర్‌ను అభినందించిన లయన్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురు కాకుండా సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించడంతో పాటు ఓటింగ్ శాతాన్ని పెంచడంలో కీలక భూమిక పోషించిన కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు అభినందించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువ కప్పి సత్కరించారు. జిల్లాలో సజావుగా పోలింగ్ జరగడానికి కృషి చేసిన అధికారులందరికి జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో లయన్స్ ప్రతినిధులు నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, డాక్టర్ బాడాన దేవభూషణరావు, కంఠం వేణు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విజయకుమార్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని నరసన్నపేట మండలం ఉర్లాంకు చెందిన యమునకు నెలలు నిండడంతో ప్రసవానికి కుటుంబసభ్యులు రిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమెకు ఎ పాజిటివ్ ప్లాస్మా అవసరం కావడంతో వైద్యురాలు డాక్టర్ సునీత సూచనమేరకు కుటుంబసభ్యులు రక్తం కోసం ప్రయత్నించారు. రక్తనిధి కేంద్రాల్లో ఎ పాజిటివ్ రక్తం నిల్వలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్న వారికి స్వచ్ఛంద సహకారంతో రక్తం కోసం ప్రయత్నించారు. చెన్నైలో హెచ్‌సిఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న పోలాకి మండలం జోళ్లవలసకు చెందిన విజయకుమార్ ప్లాస్మా అందించడానికి ముందుకొచ్చారు. సకాలంలో ఎ పాజిటివ్ ప్లాస్మా అందడంతో ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యురాలు సునీత తెలిపారు. రక్తదానం చేసిన విజయకుమార్‌ను పలువురు అభినందించారు.



వైద్య సేవలందిస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దీర్ఘకాలిక ఎముకలు, నరాలకు సంబంధించిన సయాటికా జాయింట్ పెయిన్స్, పెరాలసిస్, వెట్టికో నరాల వాపులు నయం చేసుకునేందుకు సిద్ధ ఆయుర్వేద వైద్యం ఎంతగానో ఉపకరిస్తుందని అరసవల్లి ట్రస్టు బోర్డు సభ్యులు మండవిల్లి రవి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని చిన్న బజార్ రోడ్డులో ఉన్న శ్రీవాసవి కళ్యాణ మండపంలో సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భారతీయ వైద్య రంగంలో అతి ప్రాచీనమైనది సిద్ధ ఆయుర్వేదమని, దీంతో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకునేందుకు వీలుందన్నారు. శిబిరంలో జిల్లా ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఎ. జగదీష్, శ్రీనాథ్, రితిక్ కన్నా హాజరై మందులు శస్త్ర చికిత్సలు లేకుండా వైద్యం అందించారు. ప్రాచీన వైద్య విధానంతో సిద్ధ ఆయుర్వేద వైద్యులు పాత విధానాల్లో అందించడం జరుగుతుందని ప్రతిఒక్కరూ ఈ పద్ధతుల ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని వైద్యులు సూచించారు. హైదరాబాద్‌కు చెందిన సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వచ్చే నెలలో మరోమారు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ట్రైనీ సూపర్‌వైజర్ ఉద్యోగాల కోసం దివిస్ లేబరేటరీ సంస్థ శుక్రవారం డా. బిఆర్ ఎయూలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటల నుంచి మొదలైన ఈ డ్రైవ్‌కు సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. బిఎస్‌సి, ఎంఎస్‌సి, బిటెక్, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ ఉత్తీర్ణత చెందిన వారు ఈ పోస్టుల కోసం పోటీ పడ్డారు. విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు పరిశీలించిన అనంతరం అర్హులైన అభ్యర్థులకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివిస్ లేబరేటరీ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ రాజేష్‌నాథ్ పూర్ణ ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఫలితాలను మూడు వారాల్లోగా విడుదల చేయనున్నట్లు వర్సిటీ ప్లేస్మెంట్ అధికారి డా. కె.విద్యాసాగర్ తెలిపారు. ఎంపికైన వారికి హైదరాబాద్, కాకినాడ, వైజాగ్‌లో ఉన్న దివిస్ లేబరేటరీ సంస్థల్లో ఉద్యోగులు కల్పించినట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న ఎడిఎ

ఖరీఫ్‌కు సమాయత్తం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఖరీఫ్‌కు సమాయత్తం చేయాలని రణస్థలం, శ్రీకాకుళం ఎడిఎలు వడ్డాది శ్రీనివాసరావు, కె.శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక అగ్రికల్చర్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024కు విత్తనాలు, ఎరువులు రైతుభరోసా కేంద్రాల్లో అవసరమైన వరకు సిద్ధం చేయాలన్నారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలకు రైతులకు రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. జీలుగు, కట్టేజనుము విత్తనాలు 50శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు సాగు చేసిన పంటల వివరాల నమోదు తప్పనిసరన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసాతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు డి. విజయ భాస్కరరావు, బి.బాబ్జి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌ఓఎస్‌ఎస్ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మోపసు బందరు, జాలరీపేట, సాదుపేట, పుక్కలపేట, పెద్దగనగలపేట, చిన్న గనగలపేట, నర్సయ్యపేట, ఖాజీపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సిసి రహదారులపైనే మురుగునీరు

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పల్లె ప్రజలు



మాసాహెబ్‌పేటలో సిసి రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో పలు గ్రామాల్లో సిసి రహదారులపైనే మురుగు నీరు ప్రవహి స్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని కొర్లకోట, చీమల వలస, కొత్తవలస, వంజంగి, మా సాహెబ్ పేట తదితర గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు సిసి రహదారులపైనే ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనై ఇబ్బందులకు గురవు తున్నామని వాపోతున్నారు. పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారు తప్పా పట్టించుకున్న పాపాన పోవడం లేదని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై మురుగునీరు ప్రవహిస్తూ అసౌకర్యంగా ఉండడంతో రాకపోకలు సాగించడానికి నానా ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. రానున్నది వర్షాకాలమని మురుగునీటి వ్యవస్థతో వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని వ్యాధుల బారిన పడకుండా ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు. గ్రామాల్లో సిసి రహదారులు నిర్మించి కాలువలు నిర్మించక పోవడంతో మురుగునీరు రోడ్లపై నుంచే ప్రవహిస్తుందని పలువురు చెబుతున్నారు. పలు మార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడమే తప్పా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పాలకులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై మురికి నీరు ప్రవహి స్తుండడంతో క్యూలైన్ పాటించి ఒకరి తర్వాత ఒకరు రహదారిపై నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై పలువురు సర్పంచ్‌లను వివరణ కోరగా గ్రామ పంచాయతీల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడమే దీనికి ప్రధాన కారణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాలన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని, సంపూర్ణ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టడం జరిగిందని పలువురు ప్రజా ప్రతినిధులు ఉపన్యాసాలు ఇవ్వడమే కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దానికి భిన్నంగా పల్లెల్లో పరిస్థితి కనబడుతున్నదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, మండలస్థాయి అధికారులు డ్రైనేజీ వ్యవస్థను సరిదిద్ది ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెరిగిన పోలింగ్ శాతం

ప్రజాశక్తి- పొందూరు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఎన్నడూ లేని విధంగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎంతో ఆసక్తిని కనపర్చారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చి చూస్తే 2024 ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నవారి సంఖ్య సుమారు రెండున్నర శాతం పెరిగింది. నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 78.51 మంది ఓటుహక్కు వినియోగించుకోగా, ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 81.42 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2024 ఎన్నికలకు సంబంధించి మొత్తం 1,93,858 మంది ఓటర్లు ఉండగా పురుషులు 96,179 మంది, మహిళలు 97,664 మంది, ఇతరులు 15 మంది ఉన్నారు. వీరిలో ఓటుహక్కును వినియోగించుకున్న వారిలో పురుషులు 76,103 మంది, మహిళలు 78,251 మంది, ఇతరులు ముగ్గురుతో కలిపి మొత్తం 1,54,357 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగి ంచుకున్నారు.

సరుబుజ్జిలి అత్యధికం... పొందూరు అత్యల్పం

ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి సరుబుజ్జిలి మండలంలో అత్యధికంగా పోలింగ్ నమోదు కాగా, పొందూరు మండలంలో అత్యల్పంగా నమోదైంది. సరుబుజ్జిలిలో సుమారు 83 శాతం పోలింగ్ నమోదు కాగా, పొందూరులో సుమారు 77 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మండలాల వారీగా ఆమదాల వలస మండలంలో 66,063 మందికి 52,454 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పొందూరు మండలంలో 64,889 మందికి 49,950 మంది, సరు బుజ్జిలి మండలంలో 28,204 మందికి 23,411 మంది, బూర్జ మండలంలో 34,702 మందికి 28,542 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో ఆమదాల వలస మండలంలో 79.39 శాతం, పొందూరులో 76.97శాతం, సరుబుజ్జిలిలో 83శాతం, బూర్జలో 82.24 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.



అన్నం వడ్డిస్తున్న మహాలక్ష్మి దంపతులు

అనురాగ నిలయంలో అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న గిరజాల మహాలక్ష్మి నగరంలోని శాంత కల్యాణ అనురాగ నిలయంలో వృద్ధులకు, పిల్లలకు అన్నదానం నిర్వహించారు. శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తన భర్త భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. అనురాగ నిలయంలో కేకు కట్ చేసి పిల్లలు, వృద్ధులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, యశోదమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు డేవిడ్ మాదారపు, శ్రీధర్మ శాస్త్ర సన్నిధానం ట్రస్ట్ ఉపాధ్యక్షులు పాలకొండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



యువతకు క్రికెట్ కిట్ అందజేస్తున్న రామ్మూర్తి

క్రీడా స్ఫూర్తి అవసరం

లావేరు: యువతలో క్రీడా స్ఫూర్తి రావాలని గుమ్మడం టిడిపి యువ నాయకుడు మజ్జి రామ్మూర్తి అన్నారు. మండలంలోని గుమ్మడాంకు చెందిన యువతకు శుక్రవారం క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని, రాష్ట్ర, దేశ ప్రగతి పురోగతిలో భాగస్వామ్యం కావాలన్నారు. విద్యతో పాటు క్రీడాల్లోను పట్టు సాధించాలన్నారు. దేశ భవిష్యత్‌లో యువతే కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముప్పిడి వెంకటేశ్వరరావు, గంధవరపు సూర్యారావు, బిర్లింగి భద్రయ్య, జి.పైడిరాజు, ఉప్పడా చలపతి మోహన్, శ్రీను, దుర్గారావు, వేణు, కళ్యాణ్, సూరిబాబు, రాజు, వెంకటేష్ తదితరులున్నారు.

యువతరం సేవాసమితి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉద్దానం రామకృష్ణాపురంలో బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిట్టి జానకమ్మను యువతరం సేవాసమితి ప్రతినిధులు శుక్రవారం కలిసి ఆర్థికసాయంగా రూ.15వేలు చెక్కును అందించారు. బ్రెయిన్ క్యాన్సర్‌తో పాటు కిడ్నీ సమస్యతో కూడా ఆమె గత కొంత కాలంగా బాధపడుతున్నట్లు తెలిందని సమితి సభ్యులు తెలిపారు. ఈమె భర్త చనిపోవడంతో కూమార్తెతో కలిసి జీవిస్తుంది. ప్రతినెలా వైద్యం కోసం సుమారు రూ.10వేలు వరకు ఖర్చు అవుతుంది. పేదరికంతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు ఆర్థికస్థోమత చాలక దాతల సహాయం కోరారు. దీనికి యువతరం సేవాసమితి స్పందించి సహాయం అందించారు. కార్యక్రమంలో యువతరం సేవాసమితి అధ్యక్షులు చింత మురళి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గొరకల సునీల్, బత్తిని విఘ్నేష్, గున్న వెంకటరమణ, కోడి నిహల్, గాడి.అఖిల్, బత్తిని లక్ష్మణ్, మల్లెనా జగదీష్, గొరకల మణి, బచ్చల వెంకటేష్, బొడ్డు మాధవరావు, కార్ని భాస్కరరావు, చింత శివ, ప్రమీల, దీపిక, నీలవేణి, సంధ్య పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న సేవాసమితి సభ్యులు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న వాకర్స్

సామాజిక సేవకుడు 'బరాటం'

శ్రీకాకుళం అర్బన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేస్తూ ఆపదలో ఉన్న అనేక మంది నిరుపేదలకు అండగా నిలిచే ఘనత నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బరాటం శ్రీనివాసరావుకు దక్కుతుందని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఇందిరా ప్రసాద్, ఎస్. జోగినాయుడు, గుడ్ల సత్యనారాయణ, పిజి గుప్తా, బి వి రవిశంకర్ అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం కేకు కట్ చేసి సభ్యులంతా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ గుడ్ల సత్యనారాయణ మాట్లాడుతూ కేబుల్ టీవీ రంగంలో దశాబ్ద కాలం పనిచేసి అనంతరం వ్యాపార రంగంలో అడుగుపెట్టి లాభాలు ఆర్జిస్తున్నారన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ చేపడుతున్న అనేక సామాజిక సేవల్లో శ్రీనివాసరావు ముందుండి నడిపిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ కార్యదర్శి బి.దేవీప్రసాద్, క్లబ్ ప్రతినిధులు సింహాద్రి, వేణుగోపాల్, పొట్నూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

ప్రజాశక్తి- నందిగాం, ఇచ్ఛాపురం



మోహనరావు



ధనుంజయ రెడ్డి

తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు 2024ను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జాతీయ పురస్కారాలకు నందిగాం మండలం నరేంద్రపురంకు చెందిన రంగస్థల పౌరాణిక భజన కళా రంగంలో గత 25 ఏళ్లుగా విశిష్ట సేవలు అందించిన జీరు మోహనరావుకు, శాస్త్రీయ సంగీత, పండరి భజన, కోలాటం, జానపదాలు కళారంగంలో 25 ఏళ్లుగా సేవలు అందించిన ఇచ్ఛాపురం మండలం టి.బరంపురంకు చెందిన జానపద కళాకారుడు తిప్పిన ధనుంజయ రెడ్డికు తెలుగు వెలుగు జ్ఞాన బుద్ధ పూర్ణ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అప్పనపల్లి భాస్కరాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ హోదాల్లో తెలుగు వెలుగు భాషాభివృద్ధికి తోడ్పడుతున్న సందర్భంగా వీరిని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ నెల 19న ఒంగోలులో జరిగే కార్యక్రమంలో అతిథుల చేతులమీదుగా పురస్కారం ప్రధానం చేయనున్నట్లు వారు తెలిపారు. వీరి ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నిరుపయోగంగా ఆర్అండ్‌బి బంగ్లా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న రోడ్లు భవనాల శాఖ అతిథిగృహం శిధిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. ఈ అతిథి గృహం బ్రిటీష్ వారి హయాంలో నిర్మించారు. పదేళ్ల క్రితం వరకు ఎంతోమంది ప్రజా ప్రతినిదులు, విఐపిలు సేద తీరేందుకు అవకాశం కల్పించిన ఈ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. లోపల శ్లాబ్ కూలి ప్రమాదకరంగా మారినా అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అతిథి గృహానికి మరమ్మత్తులు చేయించడంగాని, భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించటం ప్రభుత్వం చేయలేదు. అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం అతిథి గృహాలు మరమ్మత్తులు చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నిధులు విడుదలయ్యేలోపే ఎన్నికల షెడ్యూల్ రావటం, ఎన్నికల తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో నిరుపయోగంగా అతిథి గృహాలు ఉండి పోయాయి. సుమారు నాలుగు ఎకరాల స్థలంలో ఉన్న ఆర్‌అండ్‌బి బంగ్లాలో ఎకరా స్థలాన్ని బాలికల జూనియర్ కళాశాలకు కేటాయించారు. మిగతా స్థలమంతా నిరుపయోగంగానే ఉంది. శిధిలావస్థలో ఉన్న ఈ బంగ్లాను తొలగించి కొత్త నిర్మాణం చేపడితే ఎంతోమందికి ఉపయోగకరంగా ఉండేది. స్థానిక ప్రజా ప్రతినిదులు సైతం ఈ అతిథి గృహం వైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం. ఈ బంగ్లాలో ప్రభుత్వ కార్యక్రమాలకు అతిధులు వచ్చినప్పుడు వారి విడిదికి అందుబాటులో లేకపోవటంతో ప్రైవేట్ హోటళ్లల్లో బసచేయాల్సి వస్తుంది. ప్రస్తుతం ఈ బంగ్లా పూర్తిగా శిధిలావస్థకు చేరుకుంది. హెడ్ క్వార్టర్‌లోఉన్న ఏకైక ఆర్‌అండ్‌బి అతిథి గృహం మూలకు చేరడంతో స్థానిక హోటళ్లలోనే విఐపిలు ఉండాల్సి వస్తుంది. 2013-14 సంవత్సరంలో రాష్ట్ర విభజన కాకముందు మరమ్మతుల కోసం రూ.50 లక్షలు అంచనాలతో అప్పటి అర్‌అండ్ అధికారులు నివేదికలు పంపించారు. రాష్ట్ర విభజన తరువాత ఆగిపోయింది. ఈ విషయమై ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులకు వివరణ కోరగా భవనం పూర్తిగా శిధిలావస్థకు చేరినందున తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని తెలిపారు.



శిధిలావస్థలో ఉన్న రహదారి బంగ్లా (ఇన్‌సెట్‌లో పెచ్చులూడిన శ్లాబ్)

గ్రామాల్లో రహ దారిద్ర్యం

- గతుకుల రోడ్లు
- ప్రజలకు తప్పని తిప్పలు



డి.జి పుట్టుగ నుంచి నెలవంక వెళ్లే రహదారి

ప్రజాశక్తి- కవిటి

గ్రామీణ ప్రాంతాల్లో రహ దారిద్ర్యం తాండవిస్తోంది. గతుకుల రోడ్లు, ఇసుక కుప్పలతో మారుమూల గ్రామాల ప్రజలు తమ గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లాలన్నా, అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని తరలించాలన్నా తిప్పలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా మారుమూల గ్రామాల పరిస్థితి ఇదే విధంగా ఉంది. కవిటి మండలం నెలవంక పంచాయతీ కొమ్ముపుట్టుగ గ్రామస్తులు రెండు నెలల క్రితం తమ గ్రామానికి రహదారి వేసుకోవడానికి గ్రామంలో చందాలు వేసుకోవడం గ్రామస్థాయిలో రహదారుల పరిస్థితికి అద్దం పడుతోంది. మండల వ్యాప్తంగా మారుమూల గ్రామాల రహదారుల పరిస్థితి పరిశీలిస్తే మండలం సహలాలపుట్టుగ పంచాయతీ సహలాలపుట్టుగ నుంచి మొలిపుట్టుగ, బడ్డాయిపుట్టుగ నుంచి హత్తిపుట్టుగ, చిన్న సహలాల పుట్టుగ బొగియపుట్టుగ, మడియారిపుట్టుగ గ్రామాలకు వెళ్లే రహదారి, బిజి పుట్టుగ పంచాయతీ లొట్టిపుట్టుగ, పఠ్రిపుట్టుగ, చెవిటిపుట్టుగ, గుమ్మడిపుట్టుగ, తడకపుట్టుగ, తుంగానపుట్టుగ, బొరివంక పంచాయతీ బొగిడియాపుట్టుగ, డిజి పుట్టుగ పంచాయతీ నుంచి నెలవంక వెళ్లే రహదారి, నెలవంక నుంచి సీమూరు, సన్యాసిపుట్టుగ వెళ్లే రహదారి, కొజ్జిరి పంచాయతీలో ఎన్‌హెచ్-5 నుంచి పాత కొజ్జిరి, కరాపాడు గ్రామానికి వెళ్లే రహదారులు మారుమూల గ్రామాల రహదారులకు ప్రత్యక్ష నిదర్శనాలు. ఇవే కాకుండా మండలంలో మారుమూల గ్రామాల్లో చాలా వరకూ ఇదే పరిస్థితి కొన్నేళ్లుగా సాగుతోంది. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులను తరలించేందుకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ ఆవేదన అర్థం చేసుకుని గ్రామాలకు పూర్తిస్థాయి రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.



లొట్టిపుట్టుగ రహదారి



బొగిడియాపుట్టుగ రహదారి

దొరికిన సొత్తు బాధితునికి అందజేత

ప్రజాశక్తి- పొందూరు

దొరికిన సొత్తును ఎలా వెనకేసుకోవాలా అని చూసే ఈరోజుల్లో దొరికిన రూ.2 లక్షల సొత్తును కోల్పోయిన బాధితుడికి అందించి నిజాయితీ ప్రదర్శించాడు ఆ రైతు. వివరాల్లోకి వెళ్తే మండలం పిల్లలవలసకు చెందిన పైడి సూర్యనారాయణ దళ్లవలస బ్యాంకులో కుదవ పెట్టిన 27 గ్రాముల బంగారాన్ని గురువారం విడిపించి గ్రామానికి వస్తూ గ్రామం సమీపంలో చెరువుగట్టుపై బంగారం, రూ.4వేలు నగదుతో కూడిన మూటను పెట్టి స్నానానికి దిగాడు. కుక్కమూటను పట్టుకువెళ్లడంతో సూర్యనారాయణతో పాటు గ్రామస్తులు పరిసర ప్రాంతాల్లో వెతికినా దొరకలేదు. అయితే గ్రామానికే చెందిన గురుగుబెల్లి త్రినాథరావు పొలంలో పని చేస్తుండగా నగలతో కూడిన మూట దొరకడంతో తీసుకువెళ్ళి సూర్య నారాయణకు అందించారు. నిజాయితీతో సుమారు రూ.2లక్షల సొత్తును బాధితుడికి అందించడంతో త్రినాథరావును గ్రామస్తులు అభినందించారు.



ఎస్ఐకు ఫిర్యాదును అందజేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకులకు బెదిరింపులు

కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ జంట పట్టణాలు నివురుగప్పిన నిప్పులా ఉంది. 2024 ఎన్నికలు జరిగిన తర్వాత ఫలితాలు రాకముందే టిడివి, వైసిపి కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒకరిపై ఒకరు ఆరోపణ చేస్తు దాడులకు దిగడంతో ప్రజలు విస్తు పోతున్నారు. ఈనెల 13న పోలింగ్ జరిగిన రాత్రి చిన్నబడంలో వైసిపి నేత నిరంజన్ ఇంటిపై టిడిపి నాయకులు దాడిచేయగా వైసిపి నేతలు తమ పార్టీకి ఓటు వేయలేదని ఒక వ్యక్తిని ఇంటిలో బంధించారు. ఈ సంఘటనలు మరవకముందే పలాసకు చెందిన వైసిపి నేత తూముల శ్రీనివాస్‌కు టిడిపి కౌన్సిలర్ భర్త ఫోన్‌లో బెదిరించినట్లు శ్రీనివాస్ కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఒక సామాజిక కార్యకర్త ఎన్నికల ఫలితాలు తర్వాత కొంతమంది వైసిపి నాయకులు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోవాలని సోషల్ మీడియాలో పెట్టడం వారి పరాకాష్టకు నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 15న రాత్రి కాశిబుగ్గ హైస్కూల్ రోడ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్న యాకాశి అనే వ్యక్తిపై కొంతమంది దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు దాడులు, బెదిరింపుల సంఘటనకు సంబంధించి కాశిబుగ్గ ఎస్ఐ పారినాయుడుకు వైసిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లపై కాశిబుగ్గ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించి వారిపై తగుచర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.



చెక్కును అందజేస్తున్న సూర్యనారాయణ రాజు దంపతులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని విశాఖపట్నంకు చెందిన దంతులూరి సూర్య నారాయణ రాజు కుటుంబసమేతంగా శుక్రవారం సందర్శించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం అనివేటి మండపంలో ఇఒ చంద్రశేఖర్‌ను కలిసి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. అలాగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ, టిడిపి శ్రీకాకుళం అభ్యర్థి గొండు శంకర్‌లు సందర్శించారు.



మునగ పంటను పరిశీలిస్తున్న ఎపిడి శ్రీనివాసరెడ్డి

మునగ సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి- కవిటి

మునగసాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఎపిడి శ్రీనివాస రెడ్డి అన్నారు. మండలం బెజ్జిపుట్టుగలో మాదిన రాజ్యలక్ష్మి వ్యవసాయ క్షేత్రంలో సాగుచేసిన మునగ పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్ఆర్‌జిఎస్ పథకంలో భాగంగా జాబ్ కార్డు ఉన్న వారికి సబ్సిడీపై మునగ మొక్కలు అందించి, వాటి మెంటినైన్స్ కోసం కొంత నగదు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న ఉపాధిహామీ పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అలాగే మండలంలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులు పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీనటుడు జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో నిర్వహించారు. ఎన్‌టిఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు దుంగ సుధాకర్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఈ వేడుకల్లో టిడిపి నాయకులు గొండు శంకర్ హాజరై మానసిక వికలాంగుల సమక్షంలో కేకును కట్ చేసి పంచి పెట్టారు. వారికి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి వంశం నుంచి ప్రజాదరణ పొందిన నటుల్లో జూనియర్ ఎన్‌టిఆర్ ఒకరన్నారు. కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ బుర్రి మధు, దుంగ శ్రీధర్ మాట్లాడుతూ జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదినం సందర్భంగా నగరంలో నాలుగు రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రమణయ్య, పి.గోవింద్, శ్రీనివాసరావు, శంకర్, ఈశ్వర్, ప్రసాద్, గంగరాజు, మల్లి, పేట పద్మ, అభినయ్, రాంబాబు, షణ్ముఖ పాల్గొన్నారు.